

# 4
# పార్వతి కల

"అభినవ తగలబడి పోతోంది! తెలుసా నీకు?"

అర్ధరాత్రి ఒంటిగంటకు గాఢనిద్రలో ఉన్న నన్ను ఉలికి పాటుతో నిద్ర లేపిన ఫోన్‌లో వినపడ్డ మాటలివి. కంఠస్వరాన్ని గుర్తుపట్టాను. పార్వతి.

"రాంగ్ నంబరుకు డైల్ చేసినట్టున్నావు. ఇది ఫైర్ ఆఫీసు కాదు," అన్నాను వ్యంగ్యంగా నవ్వుతూ. అర నిముషం పాటు అటు వైపు నుండి సమాధానం లేదు.

"అభినవతో పాటు పార్వతి కూడా తగలబడిపోతుంది. మళ్ళీ రాంగ్ నంబర్ అనకు. ఈ పార్వతి ఎవరో నాకు తెలియదనకు. చావులో కూడా నాకు సుఖం లేకుండా చేయకు!" క్లిక్‌మంటూ ఫోన్ పెట్టిన చప్పుడు.

మనసు పొరల అడుగు నుంచి ఒక ప్రకంపనం ఉవ్వెత్తున లేచి మనిషిని నిలువెల్లా వణికిపోయాను. వృత్తిరీత్యా నేను డాక్టర్ని. మరణమనే మహాగ్ని నాలుకలు సాచి నా కిరుపక్కలా పారాడుతున్నా, నిబ్బరంగా ఉండటం మనసుకు నేర్పినవాణ్ణి. చావుకబురుతో పాటు అసంకల్పితంగా వచ్చే నిట్టూర్పులు, కన్నీళ్ళు, పెనుదిగుళ్ళు, భగవంతునిపై సందేహాలులాంటి మనోవికారాలను దూరంగా వుంచ

గలిగినవాణ్ణి. కానీ యిది పార్వతి మరణవార్త. ఈ అనాథ బాలికను ప్రేమించి, లాలించి, ఆకృతి లేని తన కళాస్వప్నాలకు రూపాన్నిచ్చి, స్నేహితుడనై, గురువునై, తండ్రినై, చివరికీనాడు తన మరణానికి పరోక్షంగా కారకుడనై... ఈ వార్త నన్ను భయవిహ్వలుణ్ణి చేయటంలో ఆశ్చర్యమేముంది? చావు వరకూ తనను తాను ఈడ్చుకెళ్ళి ఒక మహా శూన్యాన్ని నా ముఖంపై నిర్దయగా విసిరేసిన పార్వతి కథలో నా పాత్ర ప్రమేయం గురించి మరోసారి పున:సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

## 2

"డాక్టర్! ఒకసారిలా కిటికీ దగ్గరకు రండి. మీకో తమాషా చూపిస్తాను. ముసిలాడో చిన్నపిల్లను రేప్ చేస్తున్నాడు," వార్డులో కేస్‌షీట్ రాస్తున్న నా చెవిలో రహస్యంగా గొణిగింది స్టాఫ్ నర్స్. హాస్పటల్‌లో పనిచేసే డాక్టర్లకు, నర్సులకు సెక్స్ గురించిన మృదువైన స్పందనలు చచ్చిపోతాయి. ఆ విషయాన్ని వీళ్ళు తప్ప మరెవ్వరూ అంత తేలిగ్గా, నిర్లిప్తంగా తీసుకోరు. ఆ స్టాఫ్ నర్స్, ముసిలాడు అంటూ చెప్పింది మా ప్రొఫెసరు గురించే. కిటికిలోంచి స్పష్టంగా కన్పిస్తుంది. అర్భకమైన యువతితో పెనుగులాడుతున్నాడు డాక్టర్ గంగాధరం. కోపంతో ప్రొఫెసరు రూము వైపు నడిచాను. "ఇదీ వరస! ఈ మనిషితో ఏది చెప్పినా తంటే!" వెనుక నుండి స్టాఫ్ నర్సు నసుగుతుంది.

తలుపుపై దబదబా బాదాను. కంగారుగా వచ్చి తలుపు తీశాడు డాక్టర్ గంగాధరం. "ఏమిటి సంగతి?" వణుకుతున్న స్వరంతో అడిగాడు. తలుపు సందులో నుంచి భీతహరిణిలా నిలబడ్డ పదహారేళ్ళ బాలిక. చిట్లిన గాజులు, జారిన పైట.

"నువ్వెళ్ళిపో అమ్మాయి!" అన్నాను ఆ అమ్మాయి నుద్దేశిస్తూ. కళ్ళు తుడుచుకుంటూ చివాల్న గదిలోంచి పరుగెత్తింది. "రోడ్ల వెంట చొంగ గార్చుకుంటూ తిరిగే గజ్జికుక్క నయం నీకంటే. నీలాంటి పశువుల వల్లే ఈ వృత్తికీ దశ పట్టింది!". గంగాధరం ముఖం పాలిపోయింది. రోగిష్ఠి ముసలికుక్క మూలుగులా తనలో తాను గొణుక్కుంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

కోపంగా వార్డుకు తిరిగి వస్తున్న నాకు, "మరి మా నాన్న సంగతేమిటి?" అన్న మాటలు వినబడ్డాయి. ఉలిక్కిపడి చూస్తే ఆ పిల్ల. "మరింక వార్డులో చేర్చుకోరా?" అంది భయంగా.

"పదో నెంబరు బెడ్ ఖాళీగా ఉంది. క్రిందకు వెళ్ళి కేస్ షీట్ తెచ్చుకో!" అన్నాను సానుభూతిగా. ఆ పిల్ల ముఖంలో మళ్ళీ వెలుగు రేఖ.

ఉదయాన్నే భయం భయంగా డ్యూటీ రూమ్‌కొచ్చి టేబుల్‌పై రెండు ఆపిల్ పండ్లు పెట్టి, "చాలా థ్యాంక్సండీ!" అంటున్నప్పుడు, ఆ అర్భకపు బాలిక జీవితం ఒక కథ అవుతుందని నేను ఊహించలేదు. "నా పేరు పార్వతి. ఏ.సి. కాలేజీలో ఇంటరు

చదువుతున్నాను," అని పరిచయం చేసుకొన్నప్పుడు, మొరటుగా, అనాగరికంగా వున్నా, సహజంగా, భూమిపుత్రికలా ఉందీ పిల్ల అని మాత్రం అనుకున్నాను.

3

పది గంటల ఉదయం. పైన ఆకాశంలో ఉగ్రంగా వెలుగుతున్న సూర్యనేత్రం. పార్వతి చేతిలోని కుంచె, కాన్వాస్‌పై లయాత్మకంగా కదులుతుంది. నిర్ణిద్ర స్వప్నాలన్నీ రంగు రంగుల 'ప్రతీకలు'గా చిట్లి కాన్వాస్‌పై పారాడుతున్నాయి. యాభైమందికి పైగా ఉన్నారక్కడ. పదిహేను, యిరవై మధ్య వయసున్న బాలబాలికలు. రవి కళాశాల విశ్వనాథ్‌గారు ఏర్పాటుచేసిన ఔత్సాహిక చిత్రకారుల పోటీ అది. వృత్తికి డాక్టర్నే కానీ, ప్రవృత్తికి రంగుల్ని ఆశ్రయించినవాణ్ణి. న్యాయనిర్ణేతగా నన్ను ఎంచుకున్నారు విశ్వనాథ్ గారు. 'కళాపీఠాలు, ఆర్ట్ స్కూల్స్, వీటికతీతంగా గాలిలో, ధూళిలో అజ్ఞాతంగా ఉండి పోయే ప్రతిభను గుర్తుపట్టడానికి ఈ పోటీ ఏర్పాటు చేస్తున్నాను. ఎకడమిక్ విలువలతో ఈ చిత్రాల్ని కొలవకండి. సృజనాత్మకతా మూలాల్ని పట్టుకోండి!' అంటూ నన్ను లాక్కు వచ్చారు విశ్వనాథ్‌గారు. ప్రతిభను నిరూపించే విధానాల్లో ఆయన అంచనాలెప్పుడూ తప్పు కావు. పార్వతి చిత్రం ఏ జాతీయస్థాయి చిత్ర ప్రదర్శనలోనో ఉండగలిగే స్థాయిలో ఉంది. నందలాల్ బోస్‌లోనో లేదా మన లక్ష్మాగౌడ్‌లోనో ప్రత్యక్షం కావాల్సిన పరిణితి చెందిన జానపద శైలి ఆమె చిత్రాల్లో కన్పిస్తుంది. ఆ చిత్రాల అంతరంగంలో ఉన్న తాత్త్వికతను చూసి నేను విస్తుబోయాను. 'ఇది చిత్రమా? లిపి లేని పద్యమా?' అని ఆశ్చర్యపోయాను. చిత్రం పేరు 'రోదించే బాల్యం.' పాతకాలపు మట్టి మిద్దె. కూలిపోయిన గోడలలోంచి తొంగిచూస్తున్న మానవ కళేబరాలు. ఇంటి ముందు మంచంపై గాజుకళ్ళ ముసలితల్లి. అల్లంత దూరాన మోకాలిపై తల పెట్టుకుని రోదిస్తున్న యువతి. ఆమె చీరకుచ్చిళ్ళపై సొమ్మసిల్లి నిద్రపోతున్న పసిపిల్లలు. రౌద్రంగా ఈ యింటివైపు పరుగెత్తుకు వస్తున్న మనిషి పోలికలున్న పశువు. ఎంత భావస్ఫోరకంగా ఉందీ చిత్రం.

ఆ చిత్రానికి ప్రథమ బహుమితినిస్తూ నేను పొందిన ఆనందాతిరేకాలు వర్ణించ లేనివి. శ్రీశ్రీ మొదటి కవితను ప్రచురణ కోసం అందుకొన్న సంపాదకుడి మనఃస్థితి. లతా మంగేష్కర్ కంఠాన్ని మొదటిసారిగా విన్నప్పుడు నౌషాద్ పొందిన విభ్రాంతిలాంటిది. "కొంచెం శిక్షణ, అధ్యయనం ఉంటే మరో అమృతా షేర్‌గిల్ కాగలదీ అమ్మాయి. జీవితపు శకలాల మధ్య అనాఘ్రాతంగా పడి ఉన్న రమ్యసౌరభాల్ని వెలికి తీయాలనుకొన్న మీ కల నెరవేరింది," అన్నాను విశ్వనాథ్‌గారికి ఆ చిత్రాన్నీ, పార్వతినీ పరిచయం చేస్తూ.

విశ్వనాథ్‌గారి గుబురు మీసాల చాటున కనబడీ కనబడని చిరునవ్వు సన్నగా తళుక్కుమంది.

"బహుమతి తాలూకు వెయ్యి కాక మరో అయిదువేలకు చెక్కు యిస్తున్నాను. ఇవాళ్టి నుండి మరో ఏడాదిపాటు మీ స్టూడియోలో ఈ అమ్మాయికి అవసరమైన శిక్షణ యివ్వండి. ఈ అమ్మాయి ద్వారా గుంటూరుకు పేరు తెండి," అంటూ అయిదువేల చెక్కుతో పాటు పార్వతిని కూడా నా చేతుల్లో పెట్టారు విశ్వనాథ్‌గారు. అలా మొదలైంది పార్వతితో నా పరిచయం.

## 4

బాల్య యవ్వనాల మధ్య పెరుగుదల ఆగిపోయిన గులాబీ మొగ్గ పార్వతి. దుమ్మూ, ధూళీ పట్టి తన సౌరభాన్ని తానే మరుగుపరుచుకొన్నదీ పార్వతి. తన పదిహేను సంవత్సరాల వయసులో కొన్ని సంవత్సరాలు జీవించటం మానివేసినట్లుగా ఏ పన్నెండేళ్ల పిల్లలాగో కనిపిస్తుంది. 'కొద్దిపాటి శిక్షణతో కళా ప్రపంచములో తిరుగులేని స్థానాన్ని సాధిస్తుందీ అమ్మాయి,' అంటూ నా మిత్రులకు పరిచయం చేస్తున్నప్పుడు నా వైపు వెర్రిగా, అపనమ్మకంగా చూసిన పార్వతి చూపులు నాకింకా గుర్తే. ఈ పార్వతి తనను తాను అవిష్కరించుకోవాల్సి వుంది.

స్టూడియోలో పార్వతికాక మరో ఐదుగురు యువ కళాకారులున్నారు. వాళ్ళు 'పంచ రత్నాలు'గా ప్రసిద్ధులు. పార్వతి రాకతో వాళ్ళు వింతైన అసౌకర్యాన్ని పొందటము నేను గమనించాను. బహుశా పార్వతి రూపురేఖలు కావచ్చు. ఆమె పేదరికం కావచ్చు. ఎవ్వరితో కలవడానికి యిష్టపడని ఆమె మౌనం కావచ్చు. రక్తమోడ్చే ఎర్రటి గాయాల్లాంటి ఆమె కళ్లు కావచ్చు. ఆమె ముఖం పై అలుముకున్న దిగులురేఖల్లో తళుక్కుమనే వ్యధిత గాథలు కావచ్చు. వాళ్ళకెందుకో పార్వతి నచ్చలేదు.

"మరో అమృతాషేర్‌గిల్, మరో అర్పితాసింగ్- ఈయన వరస చూస్తుంటే ఆధునిక చిత్రకళ యిప్పుడే ప్రారంభం కాబోతున్నదని చెప్పేలాగున్నాడు."

"ఇంకో ఆర్నెల్లు చాలట, ఆ పైన దేశం పట్టలేనంత ఆర్టిస్టు అవుతుందంట."

"నాకైతే ఈవిడే ఒక మోడరన్ ఆర్ట్‌లా ఉంది. 'సౌజా' బొమ్మల్లో ఆడవాళ్ళుంటారు చూడు. అలా ఉంది!"

పార్వతి చాలారోజులు కంటి బిగువున ఈ చిత్రహింసల్ని తట్టుకొనేది. క్షమా పూర్వకమైన నిట్టూర్పును వాళ్ళ ముఖాలపై విసిరేది. రానురాను ఈ దాడి మరీ క్రూరంగా, అమానవీయంగా మారింది. పిల్లికూతలు, వెక్కిరింతలు సరేసరి. పార్వతి రూపురేఖల్తో కారికేచర్లు, కార్టూన్లు ప్రత్యక్షమయినాయి. వీటన్నిటినీ నేను గమనిస్తూనే ఉన్నా, కావాలనే మౌనాన్ని అభినయిస్తున్నాను. పార్వతిలోంచి ఒక తిరుగుబాటు రావాల్సి వుంది. అది ఆమె కళలోనూ, వ్యక్తిత్వంలోనూ రావాలని నా ఆశ. ఆ క్షణమూ వచ్చింది.

ఒక ఉదయం అప్పుడే స్టూడియోకి వచ్చిన పార్వతికి ఎదురుగా తన కారికేచర్ ప్రత్యక్షమైంది. వికృతంగా, దిష్టిబొమ్మలా వమనం తెచ్చేలా ఉంది. పార్వతి ఆ అయిదు

గుర్బి పిలిచి, "ఇన్నాళ్ళూ మీరు నన్ను టీజ్ చేస్తుంటే మీరెంత గొప్ప కళాకారులో అని భయంతో ఆ చిత్రహింసల్ని భరించాను. ఈ కారికేచర్ చూశాక మీ స్థాయి ఏమిటో అర్థమైంది. దసరాపండగ రోజుల్లో కనపడతారు చూడు పులి వేషగాళ్ళు. అలాంటివాళ్ళు మీరు. నకిలీ పులులు. కారికేచరు ఎలా వెయ్యాలో నేను చూపిస్తాను రండి!" అంటూ నిమిషాల్లో వాళ్ళ ఐదుగురి కారికేచర్లు గీసింది. ఏ ఆర్కే లక్ష్మణో, మేరియో మిరిండానో వేయగల కారికేచర్లవి. 'పంచరత్నా'ల ముఖాల్లో నెత్తుటిచుక్క లేదు.

5

బాగా ముసురుపట్టిన ఒక శీతాకాలపు సాయంత్రం పార్వతి దగ్గర నుంచి దు:ఖపు వార్తను మోసుకొస్తూ ఒక ఫోన్ వచ్చింది. "హాస్పటల్ నుంచి ఫోన్ చేస్తున్నాను. నాన్న చనిపోయాడు. మార్చ్యురీ నుండి శవాన్ని బయటకు తీయాలి. మీరు వెంటనే రండి!" ఏడుపు బలవంతంగా ఆపుకుంటూ ఆ నాలుగు మాటలూ చెప్పింది.

భయానకమైన కలలోని దృశ్యంలా ఉందా ప్రదేశం. మార్చ్యురీ ముందున్న వరండాలో గోడకు చేరబడి కూర్చుని ఉంది పార్వతి. దిగులుగా ఒంటరిగా అన్నీ పోగొట్టుకున్న దానిలా ఉంది.

"ఏమిటిది పార్వతీ? ఎలా జరిగిందీ?"

సమాధానం కోసం నోరు విప్పితే లోపలి దు:ఖం సముద్రం కట్టలు తెగుతుందేమో అన్నట్టుగా, తల దించుకొనే నీరు నిండిన కళ్ళతో ఏదో చెప్పబోయి సాధ్యంకాక, ఒక్కసారిగా నేలపై కూలబడి వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

"నాన్న చచ్చిపొయ్యాడు. మా అమ్మే ఆయన్ను చంపింది. ఈ హత్య జరిగి ఐదారేళ్లయింది. ప్రాణం యివాళ పోయింది."

సర్రియలిస్టు కవి స్వగతంలా ఉందా సమాధానం. దూరంగా గానుగచెట్టు క్రింద కూర్చున్న ముసలి కానిస్టేబుల్, నోటిలోని చుట్ట దూరంగా విసిరి మావైపు వచ్చాడు.

"నమస్కారం డాక్టరుగారు! నేను జెబుతా వినండి అసలు కథ," అంటూ మొదలుపెట్టాడు.

పార్వతి తిరస్కారంగా, కోపంగా అతని వైపు చూసింది.

"నువ్వూరుకోవే పిల్లా! అయ్యగారికి నిజం తెలియాలి గదా!" అంటూ చుట్ట పక్కకు విసిరి, "సార్! వీడో పెద్ద తాగుబోతు. తాగడంలో ఆలిండియా లెవెల్లో పోటీ పెడితే ఈడే ఫస్టు. ఈడు ఎందుకు తాగుబోతయ్యాడన్నది అదో ఫ్లాష్‌బాక్. ఇయ్యాల ఉదయం పూరాగా తాగి, ఎల్తున్న రైల్లోంచి కిందకు దూకాడు. తల పగిలి ఆన్ ది స్పాట్ డెడ్. ఇందాక ఫ్లాష్‌బాక్ అన్నానే అదీ చెప్తాను. ఈడికీ పెళ్ళానికీ పడదు. అది వీణ్ణి వదిలేసి మిండగాళ్ళ వెంటపడింది. ఈడు మనసు విరిగి తాగుబోతయ్యాడు. దానికెంత టెంపర

మెంటు అంటే ఈడికిట్టా అయ్యిందని కబురుచేస్తే, గాజులు పగలగొట్టుకొని, పసుపు తాడు బయటకు విసిరేసి, 'నావరకు వాడెప్పుడో చచ్చాడు. తాళిబొట్టు యియ్యాల తీస్తున్నాను,' అందట."

పోలీసుభాషలో మొరటుగా చెప్పిన విశేషాల్ని చీల్చుకుంటూ, గుండెల్ని పిండి చేసే పార్వతి రోదన, ఆ సాయంకాలాన్ని చేదుపాటలా చేసింది.

రాత్రి పదకొండయ్యింది శవదహనం అయ్యేసరికి. నలుగురు వార్డుబాయ్‌లు, ఇద్దరు రిక్షావాళ్ళతో పూర్తిచేశామా పని. ఎంత భయానకమైనదా రాత్రి! నిలువెత్తు జీవితం భగభగా మాడిపోయే దృశ్యం! చిక్కటి చీకటి. పెళపెళలాడుతూ మండే కట్టెలు. కాలుతున్న శరీరంలోంచి వచ్చే వాసన. 'నాన్నా! నాన్నా!' అంటూ పార్వతి చేసిన పెనురోదన. ఆ నిశిరాత్రి నిజంగా భీతిల్లిపోయాను.

6

"నా బాల్యమంతా కన్నీటిపాటలా సాగింది. ఏ అర్ధరాత్రో దబ్ దబ్‌మని చప్పుడు వినిపించి, ఉలిక్కిపడి లేచేదాన్ని. అమ్మను గొడ్డును బాదినట్లు బాదేవాడు నాన్న. ఎంత మొండిది అమ్మ! దెబ్బలు తగిలిన చోటల్లా కదుములు కట్టి, రక్తం కారుతున్నా లెక్క చేసేది కాదు. నువ్వొక లెక్కా అన్నట్లు మొండిచూపులు చూసేది. నాన్నకు ఉద్రేకం పెరిగి, ఏ కర్రపేడో, ఏ సైకిల్‌రాడ్డో, చేతికేది అందితే అది తీసుకుని కొట్టేవాడు. భరించే ఓపికలేక స్పృహతప్పి పడిపోయేది అమ్మ. అమ్మ చచ్చిందో, బ్రతికుందో తెలియక గొల్లు మని ఏడ్చేదాన్ని. భయం గొలిపే చీకటి. స్పృహ లేని అమ్మ, పెనురోదనల రాత్రిళ్ళు, నా బాల్యమంతా యిలాగే సాగింది. 'నాన్నా! అమ్మను కొట్టొద్దు నాన్నా! అమ్మ చచ్చిపోతుంది నాన్నా!' నిద్రలోనూ యివే పలవరింతలు నాకు.

'పార్వతమ్మ తల్లీ! నీ యమ్మ నీకన్యాయం జేసిందమ్మా! రైలు కింద తల పెట్టిం దమ్మా! దిక్కుమాలిన వాడు దాని ప్రాణందీశాడు తల్లీ!' ఒక ప్రొద్దుటపూట నిద్ర లేచేసరికి నా చెవిన బడ్డ మాటలవి. గుండెలు ఆగిపోయినట్లయింది. పరిగెత్తుకుంటూ వెళ్తే, రైలు పట్టాల పక్కన స్పృహ లేని అమ్మ. ఒళ్ళంతా పచ్చిపుండులా ఉంది. తనే చద్దామని పట్టాల దాకా వచ్చి ఆగిపోయిందో, లేక పక్కింటివాళ్ళు అన్నట్లుగా, 'ఆ నంజికొడుకు, కిరాతకుడు దాన్ని చంపుదామనే పట్టాలపై పడేశాడో,' తెలియలేదు. ఆ విషయం గురించి అమ్మ ఎప్పుడూ మాతో చెప్పనేలేదు. ఆరోజు నుంచే నాన్న యిల్లు విడిచి వెళ్లాడు.

"రాత్రులంటే నాకెంతో భయం. వణుకు. రాత్రులు రాకుండా ఎప్పుడూ పగలే వుంటే బాగుణ్ణు అనిపించేది. నాన్న యిల్లు వదిలి వెళ్ళినప్పటి నుండీ, ఈ రాత్రులు నా శరీరాన్ని బలంగా చుట్టుకొన్న కొండచిలువల్లా భయపెట్టేవి. అపరిచితమైన, కర్కశ మైన పాదాలు నా  గుండెల పై నడిచిపోతున్నట్లుగా టక్ టక్‌మని మ్రోగేవి. 'ఎవరే వాళ్ళు?

అక్కా ఎవరే?' చెల్లి అడిగే ప్రశ్నకు నాదగ్గర జవాబులేదు. కానీ బజార్లలో, స్కూళ్ళ లో, అసహ్యకరమైన, జుగుప్సాకరమైన చూపులతో లోకం చెప్పేది ఆ వచ్చేవాళ్ళెవరో.

"వాళ్ళను చంపేస్తాను. ఆ లంజకొడుకుల్ని చంపేత్తాను, చెల్లి నిద్రలో కలవరించేది. దాన్ని గుండెల్లో పొదుపుకుని వెక్కివెక్కి ఏడ్చేదాన్ని. 'ఇది రాక్షసి! దీన్ని చంపేయాలి,' అనిపించేది అమ్మ గుర్తుకొచ్చి. పీక్కుపోయిన ముఖం. నిత్యం కన్నీటి పొరలు కప్పిన ట్లుండే ఆ అమాయకపు కళ్ళు చూస్తే, 'అమ్మా! ఎందుకే అమ్మా! ఈ రొంపిలోకి కూరుకు పోయావు. ఏం సాధించాలనే?' అని ఓదార్చాలనిపించేది.

"ఆరోజుల్లోనే నా గుండెల్లో ఒక అందమైన కల మొలకెత్తింది. ఎక్కడి నుంచో ఒక అజ్ఞాత పురుషుడు నా కోసం వెతుక్కుంటూ వస్తాడు. అతడు అనురాగదేవత. లలిత లలిత దరహాసమూర్తి. అతని గుండెలపై పడుకొని మారాం చేస్తూ ఇన్నాళ్ళ వేదనలన్నీ అతనికి నివేదించుకొంటాను, 'ఎంత దు:ఖం! ఎంత దు:ఖం!' అని తల్లడిల్లిపోతాడు. 'మరింక ఈ కన్నీటి కథకు ముగింపు రాద్దాం!' అంటూ నన్ను సుదూర తీరాలకు తీసుకెళ తాడు. మాకు వెన్నెలముద్దల్లాంటి పిల్లలు. నా పిల్లలకు రాత్రులు భయంగొలిపే పీడ కలలు కావు. నా కలలోని రేపటిలోకి అమ్మను కూడా ఆహ్వానిస్తాను. 'క్షమించాను ఫో!' అంటాను. నా న్యాయశాస్త్రం ప్రకారం తప్పులన్నీ మగవాళ్ళవే!

"ఈ కల నాతో పాటే పెరుగుతూ వచ్చింది. ఈ కల యిచ్చే ధైర్యంతోటే ప్రతికూల పరిస్థితులన్నిటికీ ఎదురీది చదువును కొనసాగిస్తున్నాను. ఇప్పటికీ నా రాత్రులు మృగ మైదానా ల్లాగే ఉన్నాయి. గుండెలపై నిర్దయగా నడిచి వెళ్ళే ఇనుపపాదాల్లాగే ఉన్నాయి."

గుండె వాకిళ్ళను తెరచి పార్వతి తన దు:ఖగాథనూ, అజ్ఞాత భయాలనూ, మధుర స్వప్నాలనూ నాకు చెప్పింది.

"దు:స్వప్నాల రోజులన్నీ గడిచిపోయాయి. రానున్నవన్నీ మంచి రోజులే," అంటూ ఓదార్చాను.

## 7

జూలై ముప్పయి నా జ్ఞాపకాలల్లో హమేషా నిలిచి ఉంటుంది. ఓ కమ్మని కబురు చెప్పారు విశ్వనాథ్‌గారు- పార్వతి పెయింటింగ్ లలితకళా అకాడమీ త్రైవార్షిక కళా ప్రదర్శనకు ఎంపిక చేశారని.

స్టూడియోలో ఉత్సవ వాతావరణం వచ్చింది. రంగు కాగితాలు, స్వీట్సు, శుభా కాంక్షలు రోజంతా కోలాహలంగా గడిచింది. పార్వతి ఉద్వేగ గీతం అయ్యింది. క్షణాల వ్యవధిలో తన చుట్టూ ఒక సరికొత్త ప్రపంచం ఆవిష్కరింపబడింది. సంభ్రమాశ్చర్యాలతో, అభిమానంతో, ఆర్తితో పార్వతిని పలకరించే కళాభిమానుల ప్రపంచం. ఉత్సాహాల రథంపై కించిత్ గర్వపు రెక్కలు మొలిచి పార్వతి రాజకుమారిలా మిలమిలలాడింది.

ఉత్సాహపు పాటలాంటి ఆ వాతావరణంలో మైమరచిన నాకు, ఆ రాత్రి పార్వతి పంపిన ఉత్తరం ఈడ్చి చెంపపై కొట్టిన దెబ్బలా కలవరపెట్టింది. 'ప్రియమైన మీకు!' అంటూ మొదలైంది ఉత్తరం. "మీ కళ్ళ చాటున మెరిసిన సంతోషాన్ని చూసి ఎంతగా పరవశించానో! ఈ క్షణాల కోసమే సంవత్సరమంతా శ్రమించాను. తపించాను. నా తపస్సంతా మీ కళ్ళలో ఆనందాన్ని చూడటం కోసమే. లోకమంతా మిమ్మల్ని పొగడాలి. 'మీ పార్వతి' అంటూ నన్ను మెచ్చుకోవాలి! మీ కళ్ళలోని ఈ మెరుపుకోసం ఎన్ని త్యాగాలైనా చేస్తాను. లలితకళా అకాడమీ ఏం లెక్క! మొత్తం ప్రపంచాన్నే జయించుకొస్తాను. -మీ పార్వతి." 'ముక్తాయింపు- మీపై నా ప్రేమను ఎప్పుడో నివేదించుకోవాల్సింది. ఇదిగో ఇలాంటి క్షణాల కోసం ఆగాను.'

చెప్పలేనంత నిస్సత్తువ, దుఃఖం కలిగాయి. పార్వతి కథలో నేనూహించని మలుపు యిది. నా భార్య లలితతో చర్చించాను. లలిత దీన్నో పెద్ద సమస్యగానే భావించలేదు. "పార్వతిలోని ఆర్టిస్టుకు రెక్కలు వచ్చాయి. ఇక మీ ఆసరా అవసరం లేదు. స్వేచ్ఛగా ప్రపంచంలోకి వదిలెయ్యండి! కొంచెం కరుకుగా వ్యవహరించండి! మీరో విలన్‌గా మిగిలిపోయినా పార్వతికి మంచి జరుగుతుంది."

లలిత సలహా మేరకు ఆ మరుసటిరోజు స్టూడియోలో నాటకీయమైన వాతావరణం, సన్నివేశం సృష్టించబడ్డాయి. ఆ సన్నివేశం కోసం 'పంచరత్నా'లకు రెండు, మూడు గంటల రిహార్సల్ యివ్వబడింది.

పదిగంటల వేళ పార్వతి ఉల్లాసతరంగంలా స్టూడియోకి వచ్చింది. నిరసన, వ్యంగ్యం మిళితమైన స్వరాలతో పార్వతికి ఆహ్వానం చెప్పారు 'పంచరత్నాలు'.

"రండి! పార్వతీ షేర్‌గిల్! మీ కళ్ళకు మేము సత్రకాయల్లా, సూక్ష్మజీవుల్లా కనిపిస్తున్నామేమో? అయినా ఓపికతో రెండు మాటలు వింటారా?

"నీ తప్పేముంది? ఈ కీర్తిప్రతిష్ఠల రంగుటద్దాల మహత్యం అలాంటిది. ప్రపంచపు మర్యాదలు పట్టవు. ఉచితానుచితాలు తెలియవు. ఆ థ్రిల్ అలాంటిది. ఏదైనా సాహసం చెయ్యాలనిపిస్తుంది. ఎవడినైనా గిల్లి వాడి కళ్ళలో తడిని చూడాలనిపిస్తుంది. ఎవరినైనా ప్రేమించాలనిపిస్తుంది. విషమ పరీక్షలు పెట్టి వాళ్ళు గిలగిలాడుతూ ఉంటే చూడాలని పిస్తుంది.

"నీ ప్రేమ సరదాలకు ఆ వృద్ధుడే దొరికాడా? పడుచువాళ్ళం ఐదుగురం వున్నాం. ఊహు! మమ్మల్ని యిష్టపడితే ఆ పైశాచిక ఆనందం ఎలా వస్తుంది? ఆయన భార్య ఏ ఆత్మహత్య చేసుకుంటేనో, 'భగవంతుడా! ఎంత పని చేశావురా!' అంటూ ఆయన గొల్లుమంటేనో గదా నీ కానందం! ఎంత గొప్ప గురుదక్షిణ!"

ఊహించినట్లే పార్వతి మళ్ళీ స్టూడియోకి రాలేదు. గుంటూరే వదిలి వెళ్ళింది. కానీ ఈ చివరి సన్నివేశం అంత కృతకంగా, మొరటుగా ఉండకుండా ఉండాల్సిందేమో నని చాలారోజుల పాటు వ్యథ చెందాను.

8

నాలుగేళ్ళ తరువాత మళ్ళీ పార్వతిని చూశాను. 'జాతీయ సమైక్యత కోసం కళ' అనే కళామేళలో, సరికొత్త పార్వతిని చూశాను. జీవితానికి దగ్గరగా భూమిపుత్రికలా ఉండే పార్వతి ఆధునిక యువతిగా ప్రత్యక్షమైంది. టైట్ జీన్స్, పోనీ టైల్, పెదాలపై యాంకీ భాష. పార్వతిని చూస్తే ప్యూపా, సీతాకోకచిలుకగా రూపాంతరం చెందగలగటం మానవుల్లోనూ సాధ్యమేనని పిస్తుంది. ఈ పార్వతి జాలిగా, చెక్కిలిపై తడి ఆరని కన్నీటి చుక్కలా మనకు గుర్తుండే పార్వతి కాదు. కళాప్రపంచంలో తనదైన శైలితో సంచలనాన్ని సృష్టిస్తున్న నవతరం చిత్రకారిణి. ఇవాళ పార్వతి చిత్రకళా ప్రపంచంలో చర్చనీయాంశం. లలితకళా అకాడమీ ఆమె చిత్రాల 'సోలో ఎగ్జిబిషన్' ఏర్పాటు చేయగలిగే స్థాయికి ఎదిగింది.

'అభినవ' పార్వతి సృష్టించిన మరో అద్భుతం. అమృతా షేర్‌గిల్ నుండి నేటి పార్వతి దాకా ఫ్రేముల్లో బిగింపబడ్డ సాంద్రమైన, గాఢమైన వర్ణానుభూతుల్ని ఒకచోట చేర్చి, ఆధునిక చిత్రకళకు దేవాలయం అని కీర్తించబడ్డ 'సరాయ్' (సత్రం) అభినవ. లైబ్రరీ, అర్కైవ్స్, విశాలమైన వర్క్‌షాపు, గ్యాలరీలు అభినవ కళాకారుల స్వప్నశాలగా చెప్పుకుంటారు. తన పెయింటింగ్స్ అమ్మగా వచ్చిన డబ్బుతో అభినవ నిర్మించింది పార్వతి. పార్వతి 'ప్రొగ్రెసివ్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' అనే కళా సాంప్రదాయానికి కర్త కూడా. డిసౌజా, మధుసూధన్‌లాంటి వృద్ధ కళాకారులు, కొంతమంది యువ కళాకారులు కలసి ఈ ఉద్యమాన్ని మొదలుపెట్టారు. ఆధునిక చిత్రకళ యింతవరకూ ఆత్మాశ్రయంగానే సాగిందని, మొదటిసారిగా మానవతా వాదాన్ని కాన్వాస్‌పై సంరావించిన ఘనత తమదే నని వీళ్ళ వాదన.

కళామేళలో కనీసం పలకరించడానికి కూడా వ్యవధి లేనంత హడావుడిగా వుంది పార్వతి. పందలాది అభిమానులు చుట్టుముట్టగా ప్రదర్శనలోని తన చిత్రం తాలూకు ప్రక్రియని, 'ఎప్రోచ్'ని, 'మూడ్'ని వివరిస్తున్న పార్వతిని చూస్తుంటే ఒక 'నాస్టాల్జియా' అనిపించేలా ఉంది.

"ఓహ్! డాక్టర్! అర్ యు స్టిల్ ఎలైవ్ యాజ్ యాన్ ఆర్టిస్ట్? ప్రాక్టీస్ పెరిగి మీలోని కళకారుడు కునుకేసుంటాడు అనుకున్నానే. రెండు ప్రపంచాల మధ్య మీ బాలెన్స్ అద్భుతం! అన్నట్టు ఎగ్జిబిషన్‌లో మీ చిత్రాన్ని చూశాను. ఎక్స్‌ప్రెషన్ మరీ పాతగా వుంది. నిలవ ఉన్న ఆవకాయలా కొద్దిగా స్టేల్‌గా ఉన్నా రుచిగా కూడా వుంది."

"పిల్లలు బాగున్నారా? మీ శ్రీమతి? అందమైన మీ భద్రజీవనం? క్షేమమే కదా! మీలో మార్పేమీ లేదు. ఇంకా అలాగే పూల తోటలా, పచ్చగా సౌరభిస్తూ- సహజమే! ప్రపంచపు విషాదాలు మీకంటవు! ఆత్మీయుల కన్నీటిచుక్కలు మీ చర్మపు లోతుల్లోకి యింకవు!"

చూస్తుండగానే పార్వతి ముఖంలో ప్రసన్నత ఆగిపోయి, విస్ఫులింగాలు రాల్చే 'రౌద్రి'గా మారింది. "ఐ హేట్ యు డాక్టర్. నా శక్తులన్నీ సమీకరించి పెనునిప్పుగా మారి నిన్ను దహించాలనే కోర్కె కలిగింది నిన్ను చూడగానే."

"హాయ్! పారూ!" మరో యువ చిత్రకారుడు రంగనాథ్ అటుకేసి రావటంతో పార్వతి మాటలనే మంటలు రాల్చటం ఆపింది.

"డాక్టర్! నీతో మాట్లాడాలి! కొన్ని సమాధానాలు నీ నుంచి వినాలి! రూమ్‌కొచ్చి కలుస్తాను. రూమ్ నెంబర్ 405 కదూ!" ఒక క్రూరమైన నవ్వు పార్వతి పెదాలపై తళుక్కుమని నన్ను వింత భయార్ణవంలోకి విసిరింది.

తొమ్మిది గంటల రాత్రి. గోడలపై నైట్ లాంప్ వెలుగు చప్పుడు చెయ్యని వర్షంలా సన్నగా జారిపడుతోంది.

స్టీరియోలో బిస్మిల్లాఖాన్ షహెనాయి కనుపించని ఆత్మల వ్యథితగాత్రంలా గుండెల్ని పిండి వేస్తుంది. ఎదురుగా పార్వతి. కళామేళలో చూసిన ఇందాకటి పార్వతి కాదు. మరో పార్వతి. చెమ్మగిల్లిన నయనాల్తో, దీనంగా ఐదేళ్ళనాడు ఒక రాత్రిపూట హాస్పటల్లో మొదటిసారి చూసిన పార్వతి.

"ప్రపంచమంతా నాకు నీరాజనాలు పడుతోంది. ఎక్కడ నలుగురు కళాకారులు కలిసినా నా గురించిన చర్చే! ఈ దశాబ్దం పైనా, మరో దశాబ్దంపైనా నా పేరు ప్రతిష్టించగల అభిమానులున్నారు. కానీ యింత కోలాహలంలో, హడావుడిలో నా ఆత్మ మాత్రం అనాథ ప్రేతంలా బావురుమంటోంది. ఎంత దూరం ప్రయాణించినా, ఎన్ని తీరాలపైన ఎగిరినా పక్షి మళ్ళీ గూటికే రావాలి. నాకంటూ ఒక గూడు లేదు. నా ఆత్మ నివసించడానికో ఆత్మీయ గృహం లేదు. ఎంత ఒంటరి బ్రతుకు నాది. నా బాధేమయినా అర్థమవుతుందా?

"డాక్టర్! నా గుండెను విప్పి చెప్పుకోగల ఏకైక ఆత్మీయుడివి అప్పుడు, ఇప్పుడు కూడా. ఒకసారి తిరస్కరించావు. సిగ్గు విడిచి మళ్ళీ ప్రాధేయపడుతున్నాను. నన్ను దగ్గరకు తీసుకో! గుండెల్లో దాచుకో!

"నాకు భార్య హోదా కూడా వద్దు! నీ స్త్రీగా ఉండిపోనీ. అదీ నలుగురు చూపులు పడని రహస్య క్షణాల్లో. అజ్ఞాతంలో. కాదనవు కదూ!"

పార్వతి చేతులతో ముఖాన్ని కప్పుకుని కొన్ని నిముషాల పాటు దీనంగా రోదించింది. "నాకు నీపై ద్వేషం ఉంది. కానీ నా ఆశ కూడా నీవే. చిటికెడంత ప్రేమనీ, నీ రోజులలోని కొన్ని క్షణాల్నీ నాకివ్వు! ఈ కాస్త వరాన్నిస్తే, నేను ప్రపంచాన్నే జయిస్తాను."

పార్వతికి కావలసిందేమిటో నా కర్థంకాలేదు. రహస్య క్షణాల్లో నా నుంచి ఏం కోరుకుంటుంది? సెక్సా? ప్రేమా? ఈ రహస్య క్షణాల శరీరాల రాపిడితోనే ఆమె ఆత్మ గాని శమిస్తుందా? నా ఆలోచనల్ని చిద్రంచేస్తూ పార్వతి లేచి నేను కూర్చున్న కుర్చీ దగ్గరకు వచ్చింది. నా ఒడిలోకి జారి, వణికిపోయే పెదాలతో ఆర్తిగా నన్ను ముద్దు పెట్టుకుంది. వసంతకాలపు మహారణ్యంగా, మొరటుగా, కసిగా, పరిమళభరితంగా నన్ను కౌగలించుకొంది.

"పార్వతీ! నన్ను వదులు. నువ్వు కోరుకొనే జ్వాల నా శరీరంలో రగలదు. నా జ్ఞాపకాల అల్బంలో నువ్వింకా పసిపాపవే. నీ శరీరంలోని మార్పుల కతీతంగా నా గుండెల్లో నువ్వెప్పుడూ శైశవ స్వప్నానివే. ఇలాంటి లైంగిక సంబంధాన్ని, వ్యక్తిగా, డాక్టరుగా కూడా నేను నిరసిస్తాను. దయచేసి ఇక్కడ నుంచి వెళ్ళిపో! మళ్ళీ నన్ను కలుసుకోవాలని ప్రయత్నించవద్దు!"

పార్వతి హతాశురాలైంది. జ్వలించే శరీరాన్ని మళ్ళీ వస్త్రాలతో అలంకరించి వెళ్ళి కుర్చీలో కూర్చుంది. రెండు నిముషాల నిశ్శబ్దం తరువాత లేచి, బ్యాగ్ భుజానికి తగిలించుకొని, కళ్ళ నుండి జారే నీటిని ఆపుకుంటూ, కళ్ళలో మళ్ళీ అగ్నిగుండాల్ని రగిలించి, "ఈ రాత్రి ఒక గాయంలా నన్ను వెంటాడుతూనే ఉంటుంది. రక్తమోడ్చే ఈ గాయాన్ని మోసుకొని నేనిలాగే తిరుగుతుంటాను. ఈ గాయం సాక్షిగా నేను నిన్నెప్పటికి క్షమించను," అంటూ అగ్నిశిఖలా రూమ్ నుండి నిష్క్రమించింది.

9

దాదాపు సంవత్సరం గడిచిపోయింది. ఈమధ్య కాలంలో పార్వతి వార్తలలోని వ్యక్తి అయింది. సెలెబ్రిటీ లైఫ్ అంత తీయనిదేం కాదు. అప్పుడప్పుడు కత్తులబాట లాగా కూడా ఉంటుంది. వాళ్ళ కదలికలపై లక్ష కెమెరాల్ని ఫోకస్ చేసి, ఏమరుపాటుగా ఉన్న క్షణాల్ని 'గాసిప్'గా ప్రచారం చేస్తారు. పార్వతి తాగుబోతయిందని, రేయింబవళ్ళు బార్‌లలో గడుపుతుందని ఒక ప్రచారం. వారానికో ప్రియుడితో తిరుగుతూ స్వైరిణిలా మారిందని మరో అపవాదు. ఒక ఆదివారం పత్రికలో పార్వతికో బహిరంగ లేఖ రాశాడో కళాభిమాని. అయితే యివన్నీ పుకార్లేమో అనిపించేట్లుగా ఈ సంవత్సరం లోనే పార్వతి ఆర్టిస్ట్‌గా ఎన్నో విజయాల్ని సాధించింది. జహంగీర్ ఆర్ట్ గాలరీలో పార్వతి ఎగ్జిబిషన్ ఒక సంచలనం. బొంబాయి మత కలహాల నేపథ్యంలో పార్వతి వేసిన చిత్రం ఈ దశాబ్దపు అద్భుతంగా చెప్పుకొన్నారు. అయితే ఇవి పుకార్లు కాదు నిజమని పార్వతి నాకు రాసిన ఉత్తరం చెప్పక చెప్పింది. పార్వతి రాసిన రెండో ఉత్తరం యిది.

"రాజశేఖర్!" అంటూ మొదలైంది ఉత్తరం.

"మరణపు సన్నని అంచుపైన నిలబడి నీతో రెండు మాటలు మాట్లాడాలన్న వింత కోరిక ఈ ఉత్తరం.

"ఒక కాలేజీ ఎగగొట్టిన ఉదయం, నాకీ దుర్దశ ప్రాప్తించాలని కాబోలు నా బుద్ధి నన్ను రవి కాలేజీకి ఈడ్చింది. ఆ పోటీలో ఏమి గీశానో నాకే తెలియదు. నన్ను అమాంతం ఆకాశానికి ఎత్తేశావు. నా తల్లి మాంసాన్ని వెలగట్టే విటుల రాక్షస హాహాకారాలతో, మనస్సు చెడి, చెడిపోయిన గడియారంలా కాలం విలువ తెలియకుండా తిరిగే నా తండ్రి దుస్థితి గురించిన చింతతో వ్యాకులమైన నా మనస్సును ఆ ఉదయపు క్షణాలు ఒక అద్భుతమైన సమ్మోహనంలోకి విసిరేశాయి. ఒక మధురస్వప్నం నా కళ్ళ ముందు తోరణాలు కట్టింది. చిరునవ్వుల తోటలోకి తలుపులు తెరుచుకున్నాయని భ్రమపడ్డాను.

"ఎంత యాతన! ఎంత శ్రమ! ఇంగ్లీషు భాష రాకపోయినా అక్షరం, అక్షరం కూడబలుక్కుని చదివాను, నువ్విచ్చిన గొప్ప గొప్ప పుస్తకాలన్నీ. రంగులపై వ్యామోహాన్ని పెంచుకొన్నాను. కేవలం నీ కోసం. నువ్విచ్చే స్నేహమాధుర్యం కోసం. నీ సాన్నిధ్యంలో పొందే ఓదార్పు కోసం. నీ పరోక్షంలో, నేను కలలు కనే 'మనం' కోసం చిత్రకారిణిని అయ్యాను.

"ఇంత స్నేహం, యింత తాదాత్మ్యత అన్నీ ఒట్టి భ్రమలేనా? అమ్మ మీద ఒట్టు వేసి చెబుతున్నాను- ఈ కళా ప్రపంచం. ఈ కీర్తి కిరీటాలు, ఈ ఆహా ఓహోలపై నాకెప్పుడూ కోర్కె లేదు. నాకు కావలసిందొక్కటే- ప్రేమ. నేనెప్పుడూ రుచి చూడని అమ్మ ప్రేమ. కలలకే పరిమితమైన నాన్న ప్రేమ.

"దారిద్ర్యం, అజ్ఞానం, ప్రేమరాహిత్యాలతో ముక్కలు ముక్కలైన జీవితపు శకలాల పై నుండి ఒక ఆనందకరమైన సంసారస్వప్నం కావాలి. కన్నీటి తడి అంటని జీవితం కావాలి. ఆ జీవితాన్ని నేను కలలు కన్నాను. అగ్నితో దగ్ధం చేసుకొని నా శరీరాన్ని, ఆలోచన్ని సంస్కరించుకొని, కళాకారిణిగా పరివర్తనం చెందాను.

"ఇంత వేదన తరువాత, నువ్వు 'నాకింకా పసిపాపవే' అన్నావు. 'మన మధ్యన వయసుల తేడా మాటేమిటి?' అన్నావు. 'గురువునే కామిస్తావా?' అంటూ లెక్చర్లు యిప్పించావు. అయినా నిన్ను క్షమించాను. నా సిగ్గునీ, అహాన్నీ, మర్యాదనీ వదిలి, నిర్లజ్జగా మళ్ళీ నీ దగ్గరకు వచ్చాను. ఒకే ఒక్క చిన్న కోరిక నాది. భార్య హోదా కూడా వద్దు. ప్రపంచం కన్ను పడని ఏకాంతాల్లో నీ స్త్రీగా ఉండిపోనిమ్మనే చిన్న కోరిక. నీతులు చెప్పావు. స్త్రీ పురుష సంబంధాలపై వ్యాఖ్యానాలు చెప్పేవు. జంటిల్‌మెన్ వేషాన్ని అభినయించావు. నీ అవివేకపు పవిత్ర అహంకారంతో, నాకూ, ప్రపంచానికీ నడుమ నున్న సన్నని ఆశల పోగుని తెంపి వేశావు.

"నేనేం చేశానో తెలుసా! నీపై, ప్రపంచంపై, నా తండ్రిపై, సకల పురుషజాతిపై కసితో ఏం చేశానో తెలుసా- వ్యభిచరించాను! నా కీర్తి చుట్టూ ఈగల్లా మూగే మగ క్రిముల్ని రెచ్చగొట్టాను. నా శరీరాన్ని ఒక మోహశాలగా మార్చాను.

"కానీ, వాడు, నా ప్రియుడు నా శరీరాన్ని ఆక్రమించుకొంటున్న క్షణాల్లో, ఒక అగ్ని పర్వతం భగ్గుమనడానికి బదులు, ఒక మంచు సముద్రం నన్ను చుట్టుముట్టేది. వాడిలో, నా ప్రియుడిలో ఏవో పోలికలు తళుక్కుమని. నేను భయంతో మంచుగడ్డనై పోయేదాన్ని. బహుశా వాడిలో నా తండ్రి పోలికలు. బహుశా వాడిలో నా తల్లిని స్పృశించిన పందలాది విటుల పోలికలు. ఆ పోలికలు నా శరీరపు కండరాలన్నిటికీ నిషేధపు ఆజ్ఞలిచ్చి నన్నో 'ఫ్రిజిడ్'గా చేశాయి. నా గురించిన ఇన్ని ప్రచారాల తరువాత కూడా నేనింకా 'కన్య'నే! వింత కదూ!

"వింటున్నావా! నా కథ రేపు నీ విద్యార్థులకు చెప్పుకొనేందుకు 'కేస్ స్టడీ'గా ఉపయోగపడుతుంది కదూ! కలలు ఒట్టిపోయిన ఈ చర్మపు తిత్తిని ఆల్కహాలుతో జీవింపజేస్తున్నాను. నా గత శైశవ రాగధ్వనుల్లో మంద్రంగా మ్రోగే నా కలలన్నీ చచ్చిపోయి నాపై నాకే విరక్తి, ద్వేషం కలుగుతున్నాయి.

"అజ్ఞాతపు ఆవేశాలేవో నన్ను చుట్టుముట్టి, నన్ను నేను అంతం చేసుకుంటే ఆ బలవన్మరణానికి కారణాల్లో నీ వంతు లేదనగలవా?

-పార్వతి"

## 10

అర్ధరాత్రి రెండు గంటలు కావస్తుంది. నగరం గాఢనిద్రలో ఉంది. ఒక పార్వతి మరణమో, ఒక రాజశేఖరం దు:ఖమో ఈ నగర మృగాన్ని పెద్దగా కదిలించలేవు. 'ఇండియన్ ఆర్టిస్టు - సోషలాజికల్ అండ్ సైకలాజికల్ స్టడీ,' అనే గెస్ట్ లెక్చర్ కోసం ఈ నగరానికి రావటం, పార్వతి మనోవైకల్యాన్ని, మరణవాంఛను చూడవలసి రావటం గొప్ప కాకతాళీయ విషాదం.

పార్వతి ఫోన్ చేసి దాదాపు అర్ధగంట అవుతుంది. ఆటోరిక్షా ఇనుప శరీరం నగరపు రోడ్లపై అతి నెమ్మదిగా ప్రాకుతోంది. అభినవ ఆ కొసలో బంజారాహిల్స్‌లో వుంది. వింత భయాలేవో ముసరగా, మొదటిసారి మరణం నన్ను భయపెడుతంది.

అభినవ చుట్టూ ఆ పాటికే జనం మూగారు. ఫైర్ యింజన్ అప్పుడే వచ్చినట్లుంది. పొడవాటి గొట్టాలతో జలధారలు అభినవ పైకి ప్రవహిస్తున్నాయి. "పార్వతీ! పార్వతిని కాపాడండి!" అభిమాని ఎవరో రోదిస్తున్నాడు. అగ్నిసర్పాల్లా చుట్టుముట్టాయి మంటలు భవనం చుట్టూ. మనుషులు చొరబడటం సాధ్యం కావటంలేదు. పార్వతి మధ్య భవనంలో ఉన్న వర్క్‌షాపులో ఉంది.

"ఇంకా మంటలు అటుదాకా వెళ్ళలేదు. భవనం పైన పగలగొట్టి లోపలికి దిగండి," ఎవరో సలహా యిస్తున్నారు.

జనం హాహాకారాల మధ్య భవనం మధ్యకు నిచ్చెనలు వేశారు ఫైర్ డిపార్ట్‌మెంటు వాళ్ళు. ఇద్దరు సాహసికులైన ఫైర్‌మెన్ భవనంపైకి ఎగబాకారు.

వాతావరణం ఉద్వేగంగా ఉంది. భయంగా ఉంది. విషాదమనే అభౌతిక భావన రెక్కలు విప్పుకొని ఆ ప్రదేశమంతా కలదిరుగుతున్నట్లుగా ఉంది. గొట్టాల ద్వారా కురిసిన జలధారలకు మంటలు ఆరి, సుడులు రేగే పొగలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. కాలిన పెయింటింగ్స్ నుంచి వస్తున్న కమురువాసన వమనం తెచ్చేలా ఉంది.

భవనం మధ్యనున్న గాజులైట్ షేడ్‌ను పగులగొట్టుకొని లోనికి దిగారు ఫైర్‌మెన్. ఆరిన మంటల్లోంచి సగం సగం కాలిన చిత్రాలను బయటకు విసిరేస్తున్నారు. శిథిలమైన దేహాల మధ్య వేలాడుతున్న ఆత్మల్లాగా ఉన్నాయా చిత్రాలు. రెండు చేతులపైన పార్వతి శరీరాన్ని వేసుకొని బయటకు తెస్తున్నారు.

"పార్వతీ! పార్వతీ!" దు:ఖభరితమైన కేక వినబడింది సమూహంలోంచి.

పార్వతి స్పృహ తప్పి ఉంది. చేతులు, భుజం, నడుం బాగా కాలిపోయాయి. ఎర్రగా, పచ్చిగా ఉంది, ఆ కాలిన శరీర భాగం. పల్స్, హార్ట్‌బీట్ సరిగానే ఉన్నాయి. ఇంకా షాక్‌లోకి వెళ్ళలేదు. పరిస్థితి అంత ప్రమాదకరంగా లేదు. ఇద్దరు డాక్టర్లతో అపోలో వాళ్ళ అంబులెన్స్ అపాటికే వచ్చింది. పార్వతిని హాస్పిటల్‌కు తరలిస్తున్నారు.

క్షణకాలం మౌనం వహించి, మళ్ళీ పెళపెళమంటూ విరుచుకుపడ్డాయి మంటలు. నీలంగా, ఆకుపచ్చగా, పసుపుగా, ఎర్రెర్రగా ఎన్నెన్నో రంగుల్లో తగలబడు తోంది అభినవ.

'ఎంత గండం గడిచింది! గాయాలు మరీ అంత తీవ్రంగా కావు!' అని నిట్టూర్చాను. కానీ అంతలో ఒక ఉలికిపాటు. తగలబడిపోయిన అభినవ. ఈ కళావిధ్వంసం. వీటి మాటేమిటి? ఈ విధ్వంసానికి పార్వతిని ప్రేరేపించిన దుర్బలత ఎక్కడిది? ఎప్పుడు ఎలా మొదలైంది? బహుశా ఆమె పుట్టినప్పుడు! బహుశా ఆమె కుటుంబ వాతావరణం ఛిద్రమైనప్పుడు! బహుశా ఆమె తండ్రి హృదయం గాయమై ప్రాణత్యాగం చేసుకున్నప్పుడు! బహుశా ఆమె అమాయకపు తల్లి కాముక సర్ప పరిష్వంగంలో గిల గిలలాడు తున్నప్పుడు! బహుశా ఆమె కలల దీపాలు గప్పుమన్నప్పుడు! మరింకెప్పుడో! ఎప్పుడో!

పార్వతిలోని ఈ కలల విధ్వంసాన్ని ముందుగా గుర్తుపట్టలేకపోవటం నా పొరపాటే. ఇప్పుడీ పార్వతికి పునరావాసాన్నిచ్చే అమ్మ మనసు కావాలి. మనస్సును చక్కదిద్దే ఒక సైకియాట్రిస్ట్ కావాలి. ఆ రెండూ నేనే కాగలగటం కాకతాళీయమైనా, పార్వతి కథకు మాత్రం అతి సహజమైన ముగింపు.

*రచన మాసపత్రిక, జూన్ 1993*